సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 11 । జూలై । 2025



ఉమ్మడి కుటుంబానికే జై

ఉమ్మడి జిల్లాలో జాయింట్ ఫ్యామిలీలకే జై కొడుతున్నారు. వివరాలు 8లో ▸



‘నిమ్జ్’ పై ఏసీబీ దాడులు

నిమ్జ్ కార్యాలయంపై ఏసీబీ దాడులు చేసి రూ.65 వేలు స్వాధీనం చేసుకుంది. వివరాలు 8లో ▸



అన్ని వసతులు కల్పిస్తాం

డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తామని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

భూములలాక్కోవడం దారుణం

కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: సంగారెడ్డి నియోజకవర్గంలో నెల కొన్న ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యను గురువారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలిశారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలసి కలెక్టర్‌కు సమస్యలపై ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. కొండాపూర్ మండలం మందాపూర్, మునిదేవునిపల్లి గ్రామాల్లో పరిశ్రమల పేరుతో రైతులు సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం గుంజుకోవాలని చూస్తుందని, రైతుల నుంచి భూములను లాక్కుంటే రైతులు రోడ్డున పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల బతుకులు చిన్నాభిన్నం చేసేలా ప్రభుత్వ ప్రతిపాదనలు సరికాదన్నారు. రైతులకు నష్ట పరిహారం నిర్ధారణ చేసి ,సాగుకు అనుకూలంగా లేని భూమిని చూసుకుని పరిశ్రమలకు కేటాయించుకోవాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మురళీకృష్ణ



సంగారెడ్డి: జిల్లా కేంద్ర సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా మురళీకృష్ణ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ అనిల్‌కుమార్ ఆయనకు కేటాయించిన పోస్టులో కొనసాగనున్నారు.

ఎరువులపై అపోహలు వద్దు

ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): రైతులు ఎరువుల వినియోగం విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని అన్నీ కంపెనీల డీఏపీ ఎరువులు ఒకేవిధంగా మొక్కల ఎదుగుదలకు పనిచేస్తాయని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం కంగ్టితోపాటు పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రైతులకు ఎరువుల పట్ల అవగాహన కల్పించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఎరువులు అమ్మినా..అధిక ధరలకు అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని రైతులు తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఏఈఓ పాల్గొన్నారు.

త్వరలో టీచర్లకు హెల్త్‌కార్డులు

పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్



మాట్లాడుతున్న గుండు లక్ష్మణ్

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధ్యాయులకు త్వరలో ప్రభుత్వం హెల్త్‌కార్డులు అందజేస్తుందని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కల్హేర్ మండలంలో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండు లక్ష్మణ్ మాట్లాడుతూ... పీఆర్‌టీయూ సంఘం సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తుందన్నారు. పెండింగ్ బిల్లులు క్లియర్ అవుతాయని తెలిపారు. పీఆర్‌టీయూ సంఘం ఆశయాలకు కట్టుబడి ఉపాధ్యయులు పనిచేయాలని కోరారు. గుండు లక్ష్మణ్‌ను మార్డి, బీబీపేట్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు సన్మానం చేశారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

గీతం సదస్సులో లెఫ్టినెంట్ జనరల్ నీరజ్

పటాన్‌చెరు: రక్షణ రంగంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయంతో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఎండ్ మెకానికల్ ఇంజనీరింగ్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షే పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ‘వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో వస్తున్న ధోరణులు, ఆవిష్కరణలు’అంశంపై గురువారం నుంచి నిర్వహిస్తున్న రెండురోజుల జాతీయ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. రక్షణ రంగంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త సాంకేతిక అవసరమని, అందుకు వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అంతర్గత పరి శోధనల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

సంగారెడ్డి టౌన్/పటాన్‌చెరు టౌన్/హత్నూర (సంగారెడ్డి): గురు పౌర్ణమి పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని సాయిబాబా ఆలయంతోపాటు పట్టణ శివారులోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం, వైకుంఠపురం ఆలయాలలో భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు బాబాకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఇక హత్నూర మండలం మాధూర గ్రామ శివారులోని దత్తాచి నక్షత్రంలో గురు పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ స్వామి వారికి ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీత రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎమ్మెల్యే లకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్‌లోని సాయిబాబా దేవాలయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



సంగారెడ్డి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు



అలంకరణలో సాయిబాబా

ఫైర్ సేఫ్టీకి పాతర

- అగ్ని ప్రమాదాల నివారణకు కనీస నిబంధనలు పాటించని సిగాచీ
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న పరిశ్రమ ఆగడాలు
- రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసిన అగ్నిమాపకశాఖ



సిగాచీ పరిశ్రమలో ఎగసి పడుతున్న మంటలు (ఫైల్ ఫొటో)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పదుల సంఖ్యలో అమాయక కార్మికుల ప్రాణాలను బలిగొన్న సిగాచీ పరిశ్రమ ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీలో కనీస భద్రత ప్రమాణాలు పాటించని యాజమాన్యం..ఇటు ఫైర్ సేఫ్టీ నిబంధనలకు సైతం పాతర వేసినట్లు అధికారుల ప్రాథమిక పరిశీలనలో తేలింది. జూన్ 30న జరిగిన ఈ భారీ పేలుడు ఘటనలో ఇప్పటికే 44 మంది మృతి చెందగా, ఎనిమిది మంది ఆచూకీలేకుండా పోయారు. అధికారికంగా ప్రకటించకపోయినా ఈ దుర్ఘటనలో చనిపోయిన వారి సంఖ్య 52కు చేరింది. మరో 16 మంది ఆస్పత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు.

అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీల ఆటోమెటిక్ స్ప్రింక్లర్ సిస్టం ఉండాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఈ స్ప్రింక్లర్లు తెరుచుకుని అగ్ని కీలలను ఆర్పే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ ఈ పరిశ్రమలో ఈ సిస్టం లేదని ఆశాఖ అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అలాగే ఆటోమెటిక్ డిటెక్టర్ సిస్టం కూడా అమర్చుకోవాలి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండకుండా తక్షణం స్పందించేలా ఈ సిస్టం పనిచేస్తుంది. కానీ, ఆటోమెటిక్ డిటెక్టర్ కూడా లేదు. ఫోమ్‌ఆధారిత అగ్ని నిరోధక వ్యవస్థ కూడా అందుబాటులో ఉంచుకోవాల్సి ఉండగా, రూ.వందల కోట్ల లాభాలను ఆర్జిస్తున్న యాజమాన్యం ఈ అగ్ని ప్రమాదాల నివారణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోలేదు.

మంటలార్పేందుకు నీళ్ల సంపు కూడా లేదు

పరిశ్రమలోనైనా కనీసం లక్ష లీటర్ల సామర్థ్యంతో కూడిన నీళ్ల సంపు, దానికి కరెంట్, డీజిల్‌తో నడిచే మోటార్లు ఉండాలి. కనీసం ఈ చిన్న ఏర్పాట్లు కూడా చేయలేదంటే యాజమాన్య నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

- ఉత్పత్తి కొనసాగే ప్రొడక్షన్ బ్లాక్ పైనే అడ్మిన్ బ్లాకు ఉంది. ఈ బ్లాకుకు ఎమర్జెనీ డోర్లు ఎమర్జెనీ మెట్లు కూడా లేవు. బయటకు దారిచూపే సైన్‌బోర్డులు ఉండాలి. ఈ అగ్ని ప్రమాదంలో చిక్కుక్కున్న వారు ఈ ఎమర్జెన్సీ డోర్లు లేక పైప్‌లైన్‌లు పట్టుకుని కిందికి దూకినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది.
- ఫైర్ ఇంజన్ తిరిగేంత స్థలం ఫ్యాక్టరీ చుట్టూ ఉండాలి. కానీ ఈ ఫ్యాక్టరీకి ఆ స్థలం కూడా లేదు. రెండు వైపులా పబ్లిక్ రోడ్లు మాత్రమే ఉన్నాయి. ఇలా అగ్ని మాపకశాఖకు సంబంధించిన ఏ ఒక్క నిబంధనను కూడా పరిశ్రమ యాజమాన్యం పాటించలేదంటే నిరుపేద కార్మికులు, ఉద్యోగుల ప్రాణాల పట్ల ఆ యాజమాన్యానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

జేఎఫ్‌సీఎం కోర్టులో విచారణ

సిగాచీ పరిశ్రమపై అగ్నిమాపకశాఖ కూడా తాజాగా కేసు నమోదు చేసింది. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ యాక్టు –1999 సెక్షన్ 31, 31ల కింద ఈ నెల 7న సంగారెడ్డి అగ్నిమాపకశాఖ అధికారులు నమోదు చేశారు. సంగారెడ్డి జిల్లా జేఎఫ్‌సీఎం కోర్టులో ఈ కేసు విచారణ జరగనుంది. అగ్నిమాపకశాఖకు సంబంధించి కనీస నిబంధనలు పాటించకుండా... నిర్లక్ష్యం చేసినందుకుగాను ఈ కేసు నమోదు చేసినట్లు అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. అన్ని శాఖల మాదిరిగానే అగ్నిమాపక శాఖ ప్రమాదం జరిగాక..అమాయక కార్మికుల ప్రాణాలు పోయాక చర్యలకు ఉపక్రమించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

17మంది అధికారులకు షోకాజ్!

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన 17 శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులకు కలెక్టర్ పి.ప్రావీణ్య షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈనెల 7న జరిగిన ప్రజావాణికి ఈ అధికారులు హాజరు కాకుండా, తమ కిందిస్థాయి ఉద్యోగులను పంపారు. దీనిపై కలెక్టర్ ఈ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

ఎరువుల కొరత ఉండొద్దు

కలెక్టర్ ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ ఉద్యానవన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..యూరియా స్టాక్‌ను ప్రణాళిక బద్ధంగా రైతులకు పారదర్శకంగా అందించాలన్నారు. అధికారులు విధిగా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన లక్ష్యం మేరకు 3,750ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ పంటను విస్తరించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయిల్‌పామ్ పంటపై రైతులకు అవగాహన కల్పించి సకాలంలో ప్లాంటేషన్ పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సునీత, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు పోయి.. పనులను పరిశీలించి


ఎద్దుమైలారం గ్రామాన్ని సందర్శించిన తమిళనాడు అధికారుల బృందం



ఎద్దు మైలారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న తమిళనాడు బృందం సభ్యులు

కంది(సంగారెడ్డి): కంది మండలం ఎద్దు మైలారం గ్రామాన్ని గురువారం తమిళనాడు అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందం సందర్శించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ ఆర్‌డీ)లో పొందుతున్న శిక్షణలో భాగంగా ఎద్దు మైలారం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ద్వారా జారీ చేసే మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు, ఇంటి టాక్స్ పత్రాల జారీ ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త శుద్ధీకరణ, క్రీడా ప్రాంగణం , డంప్ యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ అనిత, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, ఎంసీహెచ్‌ఆర్‌డీ ప్రోగ్రాం అధికారి అనిల్ కుమార్, ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ రెజీనా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తోపాటు తమిళనాడుకు చెందిన జెడ్పీ చైర్మన్లు, సీఈఓలు, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రూ.కోటి నష్టపరిహారం ఇవ్వండి



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన, ఆచూకీలేని కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని గురువారం తెల్లాపూర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీకాంత్‌గౌడ్‌లు కలసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో జరిగిన ప్రమాద వివరాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నాయకులకు వివరించారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వన మహోత్సవంతో పచ్చదనం

జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య



మొక్క నాటి నీరు పోస్తున్న అంజయ్య

రాయికోడ్(అందోల్): వన మహోత్సవ కార్యక్రమంతో గ్రామాల్లో పచ్చదనం మరింత పెరుగుతుందని గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జి.అంజయ్య పేర్కొన్నారు. రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ప్రత్యేక అధికారి జగదీశ్ తదితరులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మొక్కలను పెంచడం ప్రతీ ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని కోరారు. మండలంలోని పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులపై ఎంఈఓ మాణయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పని తీరును పర్యవేక్షించి విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.

మహిళా శక్తి సంబరాలు

ఈనెల 18 వరకు వేడుకలు

- మహిళలకు రూ.930 కోట్ల రుణాల లక్ష్యం
- లబ్ధి పొందుతున్న మహిళా సంఘం సభ్యులు



సంగారెడ్డి మండలంలోని నాగపూర్‌లో మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తున్న మహిళా సంఘం సభ్యులు

సంగారెడ్డిటౌన్: గ్రామీణ ప్రాంతంలోని మహిళలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా చేయాలని లక్ష్యంతో వివిధ రకాల పథకాల రూపంలో రుణాలను అందజేస్తూ అభివృద్ధికి సహకరిస్తున్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, స్త్రీ నిధి రుణాలను అందజేస్తున్నారు. గ్రామాల్లోని మహిళలు ఆర్థికంగా స్థిరపడేలా మహిళా సంఘం సభ్యులకు ప్రభుత్వం రాయితీ రూపంలో రుణాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గతేడాది రూ.911 కోట్ల రుణాలను అందజేశారు. మహిళా సంఘాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పేరుతో అభివృద్ధి పనులను చేపడుతుంది. ఇందులోభాగంగా మండల, గ్రామస్థాయిలలో సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 12 నుంచి 18 వరకు నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు, పెట్రోల్ పంపుల నిర్వహణ, చేపల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, కిరాణా దుకాణాలు, టెంట్ హౌస్, పాలడైరీ, పిండిగిర్నీలు ఏర్పాట్లకు ప్రోత్సహిస్తూ మహిళల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 25 మండలాలలో 695 గ్రామ సంఘాలు ఉండగా అందులో 18,448 సంఘాలు వున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,94,013 మహిళ సంఘం సభ్యులు ఉన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నెలనెలా వాయిదాల రూపంలో డబ్బులు చెల్లిస్తూ వివిధ రకాలుగా లబ్ధి పొందుతున్నారు.

మహిళా సంఘాలలో కొత్తగా ఇవి...

- ఈ ఏడాది నుంచి దివ్యాంగ మహిళలకు గ్రామాలలో ఐదుమందికి కలిసి ఒక గ్రూపును ఏర్పాటు చేస్తున్నారు.
- 14 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన యువతులకు గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు.
- 18 నుంచి 60 ఏళ్లున్న మహిళలకు సంఘంలో లేని వారికి సభ్యత్వాలు కలిగించే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- 60 ఏళ్ల పైబడిన వారికి కొత్తగా గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేయడానికి సన్నాహమవుతున్నారు.
- నిరక్షరాస్య మహిళలను గుర్తించి ప్రత్యేకంగా చదివించేందుకు మహిళా సంఘంలోని సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- మండలానికి ఒకటి చొప్పున ఆర్టీసీ బస్సులను త్వరలోనే అందజేయనున్నారు.
- అమ్మ ఆదర్శ పాఠశాలలో మహిళా సంఘాల సభ్యుల ద్వారా పాఠశాలను అభివృద్ధి చెందేలా కృషి చేశారు.
- గృహ నిర్మాణాలకు కావలసిన ఇటుకలను, కార్ డ్రైవింగ్ శిక్షణను అందించి మహిళల కోసం మరింత ఉపాధి కల్పిస్తున్నారు.
- జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు గ్రామీణ అభివృద్ధి సంస్థ, మహిళా సమైక్యాలు మరింత కృషి చేస్తున్నాయి.
- 2025–26 గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.930 కోట్ల రుణాలను లక్ష్యంగా ఇచ్చింది.
- మహిళలకు రుణాలు అందిస్తూ వారు సకాలంలో చెల్లించుకుంటూ అభివృద్ధిలో ముందుకెళ్తున్నారు.
- గ్రామ, మండల సమైక్య సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ జిల్లాలో మహిళా శక్తి సంబరాలను నిర్వహిస్తున్నారు.

చిరు వ్యాపారం సాగిస్తున్నా



మహిళా సంఘంలో రుణాన్ని తీసుకుని పాపడ్ల మెషీన్‌ను కొనుగోలు చేశాను. వాటిని తయారు చేస్తూ అమ్ముకుంటూ మంచి వ్యాపారాన్ని సాగిస్తున్నాను. వ్యాపారంలో లాభాలు పొందుతున్నాను.

–అంబిక, ఇస్మాయిల్ ఖాన్ పేట్ గ్రామం, సంగారెడ్డి మండలం

కుట్టు మెషీన్ నడిపిస్తున్నా



సంఘం ద్వారా బ్యాంకులో రుణం తీసుకుని బట్టలు కుట్టడంతోపాటు మహిళలకు టైలరింగ్ శిక్షణనిచ్చి ఆదాయాన్ని పొందుతున్నాను. నాతోపాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నా.

–సంతోషి, గుమ్మడిదల మండలం

పురుషులతో సమానంగా వేతనాలు



పురుషులతో సమానంగా పనిచేస్తూ వేతనాలను తీసుకుంటున్నాం. మహిళా సంఘం ద్వారా జిల్లా కేంద్రంలోని సంగారెడ్డిలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. 16 మంది మహిళలం ఉపాధి పొందుతున్నాము.

–సుకన్య, నలంద నగర్ సంగారెడ్డి

వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



జిల్లాలోని మహిళా సంఘం సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలను అందిస్తున్నాం.

–జ్యోతి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన మండలం కపూర్‌నాయక్ తండా గ్రామ పరిధిలోని శ్రీరాం తండాలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు ఇలా... తండావాసులకు తాగునీరు సరఫరా చేసేందుకు వెళుతున్న వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాలేదు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతోనే ట్రాక్టర్ బోల్తాపడినట్లు తండావాసులు వాపోయారు.

బస్సు, బైక్ ఢీ..

- ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో కిందపడిన గణేష్

కౌడిపల్లి(నర్సాపూర్): బస్సు, బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి బస్టాండ్ వద్ద 765డి జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... చిలప్‌చెడ్ మండలం రాందాస్‌గూడ గ్రామానికి చెందిన గణేష్ తన బైక్‌పై కౌడిపల్లికి వచ్చి బస్టాండ్‌వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. అదే సమయంలో బస్టాండ్ నుంచి పల్లెవెలుగు బస్సు రోడ్డుపైకి రావడంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న గణేష్ కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో బాధితున్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



జయరాం

వెల్దుర్తి(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని యశ్వంతరావ్‌పేట తండాలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం... తండాకు చెందిన నేనావత్ దుర్గ్య, జయరాంలు అన్నదమ్ములు. భూమి పంపకం విషయంలో గత నెల 29న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా దుర్గ్య వెళ్లలేదు. కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని బహుదూర్‌పల్లిలో నివాసముంటున్న జయరాం (55) ఆ రోజు రాత్రి తండాలోనే ఉండి మరుసటిరోజు బహుదూర్‌పల్లి వెళ్లిపోయాడు. దీంతో కొద్ది సేపటికే కింద పడిపోగా చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. తన భర్తను అతని సోదరుడు దుర్గ్య, వదిన రాణి దారుణంగా కొట్టడంతోనే నీరసంతో మృతి చెందాడని మృతుడి భార్య జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో సైబర్ మోసం

– రూ.35 లక్షలు పోగొట్టుకున్న గృహిణి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ గృహిణి రూ.35 లక్షలు పోగొట్టుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సుప్రజ హోమ్స్‌కు చెందిన మహిళకు ఏప్రిల్ 2న ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేసింది. అనంతరం నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ గృహిణి నగదును ఆన్‌లైన్‌లో పలు దఫాలుగా ఇన్వెస్ట్ చేస్తూ వచ్చింది. పెట్టిన నగదుతో పాటు, లాభాలు చూపిస్తూ అపరిచిత వ్యక్తి వచ్చాడు. అయితే బాధితురాలు.. కుటుంబ సభ్యులు తన ఖాతాలో ఉంచిన నగదును ఇన్వెస్ట్ చేస్తూ వచ్చింది. రూ.35 లక్షలు పెట్టిన అనంతరం తాను పెట్టిన నగదుతో పాటు, లాభాలను ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి, సైబర్ క్రైమ్ పోలీసులకు, అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడికే జై.. ఒక్కరిద్దరికే సై

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న వైనం

- సెటిలయ్యాకే వివాహం అంటున్న యువత
- ఉమ్మడి కుటుంబాలు మేలంటున్న పలువురు
- సిద్దిపేట జిల్లాలో 10,12,065 జనాభా
- అధిక జనాభాతో అనర్థాలు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబానికే ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కలిసి ఉంటేనే కలదు సుఖమంటూ పెద్దలు చెప్పిన మాటను నిజం చేస్తున్నారు. సమాజంలో మారిన జీవన పరిస్థితులు, కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ పట్టణాల్లో స్థిరపడి పెద్దలకు దూరంగా ఉంటున్నారు. దీని వల్ల చిన్న చిన్న సమస్యలకే గొడవలు పడి, ఓపిక లేక వివాహమైన కొన్ని నెలలకే విడిపోతున్నారు. అదే ఉమ్మడి కుటుంబంలో ఉంటే మనోధైర్యం కల్పించి కుటుంబ సభ్యులు అండగా ఉంటారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉన్న దంపతులు ఉమ్మడి కుటుంబంతోనే సంతోషంగా ఉండవచ్చని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. నేడు ప్రపంచ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. సిద్దిపేటకమాన్ / సంగారెడ్డి క్రైమ్:



ఉమ్మడి కుటుంబంతో కిరణ్, అనిత దంపతులు

సిద్దిపేట జిల్లాలో 2,38,049 గృహాలున్నాయి. మొత్తం 10,12,065 జనాభా ఉంది. వీరిలో 5,04,141 మంది పురుషులు, 5,07,924మంది మహిళలు ఉన్నారు. నూతన టెక్నాలజీ, మారుతున్న పరిస్థితులు, ఆలోచన విధానం, ఉద్యోగ, వ్యాపార రీత్యా కొంత మంది ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. యువత జీవితంలో స్థిరపడిన తర్వాతే పెళ్లి, పిల్లలు అనే ఆలోచనతో ఉన్నారు. 30 ఏళ్లు దాటిన యువత చాలా మంది జీవితంలో స్థిరపడక పోవడంతో వివాహాలకు వెనకడుగు వేస్తున్నారు. జనాభా పెరగడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జనాభా పెరుగుతున్న కారణంగా ఆహార ధాన్యాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం లేకపోలేదు.



చ.కి.మీటర్‌కు సగటున 340 మంది

సంగారెడ్డి జిల్లాలో 4.492.07 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి ఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం 15,27,301 మంది జనాభా ఉన్నారు. ఒక చదరపు కిలోమీటర్‌కు జనసాంద్రత 340 నమోదై ఉంది. 15 లక్షల పైగా జనాభా ఉండగా ఇందులో దాదాపు 50 శాతానికి పైగా యువత మరియు వృద్దులే ఉన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడితే వేలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో విపరీతమైన పోటీ నెలకొంది. అటు ప్రైవేట్ రంగంలోనూ పోటీ ఉంది. దీనికంతటికి ప్రధాన కారణం పెరుగుతున్న జనాభా అనుగుణంగా వనరులు లేకపోవడం అని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జనాభా పెరుగుదల వల్ల నివాస సముదాయాలు పెరిగిపోవడం, రియల్ ఎస్టేట్ రంగం వ్యాప్తి చెందుతుండటంతో క్రమంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

జనాభా పెరిగితే ఏర్పడే సమస్యలు

- ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- అడవులు అంతరించిపోతాయి.
- ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బందిపెడతాయి.
- సహజ వనరులు లేకపోవడంతో భవిష్యత్ అవసరాలకు ఆటంకంగా మారుతుంది.
- జనాభాకు అనుగుణంగా ప్రభుత్వాలు అవసరాలు తీర్చాలి.
- నిరుద్యోగం సమస్య పరిణమిస్తుంది.

జనాభాను నియంత్రించాలి

నేను నా భార్య అనిత, మూడేళ్ల పాప శ్రీనికతో కలిసి పట్టణంలోని వివేకానంద కాలనీలో ఉమ్మడి కుటుంబంగా నివాసం ఉంటున్నాం. అన్నయ్య, వదినె, పిల్లలు, అమ్మతో పాటు మొత్తం 8మందితో సంతోషంగా ఉన్నాం. ఆడ, మగ అని తేడా లేకుండా పిల్లలను బాగా చదివించి, వారికి భవిష్యత్‌ను అందించాలి. ప్రభుత్వాలు కూడా అందుకు అనుగుణంగా విద్య, వైద్యం వంటి రంగాల్లో సౌకర్యాలు కల్పించాలి. జనాభా నియంత్రణపై అవగాహన కల్పించాలి.

– గుండబోయిన కిరణ్ అనిత, సిద్దిపేట

ఉమ్మడి కుటుంబాలకే మొగ్గు

ప్రస్తుతం సమాజంలో మారిన జీవన పరిస్థితులు, కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తూ పట్టణాల్లో స్థిరపడి పెద్దలకు దూరంగా ఉంటున్నారు. యువత వేరు కాపురం పెట్టడం వల్ల చిన్న చిన్న సమస్యలకే గొడవలు పడి, ఆలోచన, అనుభవం, ఓపిక లేకపోవడంతో వివాహమైన కొన్ని నెలలకే విడిపోతున్నారు. మరి కొంత మంది తమకు ఆడ, మగ అని తేడా లేకుండా ఒక్కరు చాలు అని వారికి ఉన్నత చదువు నేర్పించి జీవితంలో ఉన్నత స్థానంలో చూడాలని కోరుకుంటున్నారు. అలాగే గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉన్న దంపతులు ఉమ్మడి కుటుంబంతో సంతోషంగా ఉండవచ్చని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఉమ్మడి కుటుంబాలు మేలు



ప్రస్తుతం యువత చాలా మంది పెళ్లి తర్వాత ఉద్యోగ, వ్యాపార రీత్యా పట్టణాలకు వెళ్లి విడిగా ఉంటున్నారు. సలహాలు, సూచనలు చేయడానికి కుటుంబ పెద్దలు వారితో లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మనాన్నలు, అన్నాదమ్ములు, అక్కాచెల్లెల్లతో కలిసి ఉండటం వల్ల సంతోషంగా ఉంటుంది. పిల్లలకు పెద్దలు గౌరవించేలా, వారికి మంచి అలవాట్లను తల్లిదండ్రులు నేర్పించాలి. నేను నా భార్య లావణ్య, బాబు హృషికేష్ రెడ్డి, అమ్మనాన్నతో కలిసి పట్టణంలో నివాసం ఉంటున్నాం.

– వంగ రాజశేఖర్‌రెడ్డి లావణ్య

జనాభా నియంత్రణ అవసరం...



సహజ వనరులు అధికంగా ఉన్న మన దేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాకుండా, ప్రజలు సైతం స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. జనాభా దృష్ట్యా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం ప్రధాన సమస్య. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– రమేష్, ప్రిన్సిపాల్, తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్

మహిళల రక్షణకు భరోసా కల్పించాలి

సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్ : పిల్లలు, మహిళల రక్షణకు మేమున్నామని పూర్తి నమ్మకం, భరోసా కల్పించాలని సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, భరోసా సిబ్బందితో సీపీ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షీటీమ్ మహిళలు, బాలికలకు రక్షణ కవచంగా పనిచేయాలన్నారు. పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. హాట్‌స్పాట్‌లను ప్రతి రోజు మూడు నాలుగు సార్లు సందర్శించాలన్నారు. ఫిర్యాదు బాక్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు, పార్క్‌లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, మూడు డివిజన్‌ల షీటీమ్, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

ప్రజల రక్షణకు ప్రాధాన్యతనివ్వాలి

గజ్వేల్‌రూరల్: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి ప్రాధాన్యతనివ్వాలని సీపీ అనురాధ పేర్కొన్నారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐలు రఘుపతి, ప్రేమ్‌దీప్ గురువారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సీపీ పలు సూచనలు చేశారు.

వరకట్న వేధింపులతో గర్భిణి ఆత్మహత్య

ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

టేక్మాల్ (మెదక్): వరకట్నం వేధింపులతో నిండు గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని హసన్‌మహమ్మద్ పల్లి గ్రామంలో గురువారం వెలుగుచూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎక్కల సాయిలు మూడో కూతురు మానస (17)ను పెద్దశంకరంపేట మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన తెరిగోర సంగమేశ్వర్‌తో 2024 ఏప్రిల్ 19న వివాహం చేశారు. కాగా, రెండేళ్ల క్రితం సంగమేశ్వర్‌ను హసన్ మహమ్మద్‌పల్లి గ్రామానికి చెందిన ఎక్కల పోచమ్మ, బీరయ్య తన ఇంటికి దత్తత తీసుకున్నారు. వివాహ సమయంలో తులం బంగారంతో పాటు బైకు కోసం లక్ష రూపాయలు ఇచ్చారు. ఇంకా ఐదు తులాల బంగారం ఇవ్వాల్సి ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ పంటలపై ఇస్తానని మానస తల్లిదండ్రులు చెప్పారు. ఈ బంగారం కోసం తరచూ సంగమేశ్వర్ భార్యను వేధిస్తుండగా పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. మానస 8 నెలల గర్భిణి కావడంతో తమ ఇంటికి తీసుకెళ్తామని ఈ నెల 7న మానస తల్లి బేతమ్మ వెళ్లి అడగగా పంపించనని గొడవపడ్డాడు. బుధవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపులు మూసి ఉన్నాయి. ఇంటి పైకప్పు తెరిచి లోపలికి చూడగా మానస దూలానికి చీరతో ఉరివేసుకొని మృతి చెందింది. తన కూతురు అల్లుడు వేధింపులతోనే ఉరివేసుకున్నదని తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటన స్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

నిమ్జ్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- డిప్యూటీ తహసీల్దార్ వద్ద రూ.15 వేలు స్వాధీనం
- మరో రూ.50 వేలు రికవరీ
- డిప్యూటీ కలెక్టర్‌తో సహా మరో ఇద్దరు అరెస్టు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నిమ్జ్ కార్యాలయంపై గురువారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వద్ద రూ.15 వేలు, డిప్యూటీ కలెక్టర్‌కు ఇవ్వాలనుకున్న మరో రూ.50 వేలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. ఏసీబీ మెదక్ డీఎస్పీ సుదర్శన్ కథనం ప్రకారం..న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ మక్బూల్ 50 ఏళ్ల నుంచి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకు సంబంధించిన భూమి గ్రామంలో ఉంది. నిమ్జ్ ప్రాజెక్టులో భూమి పోతుందని తెలుసుకున్న అతడు పరిహారం కోసం కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ కలెక్టర్ రాజును కలిసి పట్టాపాస్‌బుక్‌ను అందజేశాడు. ఏడాది నుంచి తిరుగుతున్నా పరిహారం ఇవ్వడం లేదు. మే 9న పరిహారం ఇస్తామని, కార్యాలయానికి రావాలని ఫోన్ వచ్చింది. అక్కడికి వెళ్లిన ఆయనను విచారణ చేయాలని పంపించారు. మక్బూల్‌కు ఓరోజు డ్రైవర్ దుర్గయ్య ఫోన్ చేసి రూ.5 లక్షలు ఇస్తే పని అవుతుందని చెప్పాడు. డిప్యూటీ కలెక్టర్ రాజుకు రూ.50 వేలు, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్‌కు రూ.15 వేలు కార్యాలయం సిబ్బందికి కలిపి మొత్తం రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశాడు. రూ.75 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఈ మేరకు రూ. 52.87 లక్షల పరిహారం డబ్బులు మక్బూల్ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ఆ తర్వాత డబ్బుల కోసం ఫోన్ చేస్తుండటంతో విసుగుచెందిన మక్బూల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహా మేరకు గురువారం నిమ్జ్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు రూ.15 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డిప్యూటీ కలెక్టర్‌కు రూ.50 వేలు ఇవ్వడానికి వెళ్లగా హైదరాబాద్‌లో తీసుకుంటానన్నాడు. రూ.50 వేలను స్వాధీనం చేసుకుని ,డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డిప్యూటీ కలెక్టర్ రాజు, డ్రైవర్ దుర్గయ్యను అరెస్టు చేశారు.



ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీశ్, డ్రైవర్ దుర్గయ్య, స్వాధీనం చేసుకున్న నగదు

అద్దెకుండే వారి వివరాలు తీసుకోవాలి

- కార్డన్ సర్చ్‌లో 80 వాహనాలు సీజ్
- తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్



వాహన పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల వాడ కావడంతో అద్దెకు వచ్చే వారి వివరాలను తప్పనిసరిగా యజమానులు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. గురువారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్‌లో వేకువజామున కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ఇండ్లలో అద్దెకుండే వారి వివరాలు సేకరించారు. అంతే కాకుండా ఇండ్ల మధ్య బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి వద్ద నుంచి 250 మద్యం బాటిల్లు, 50 బీరు బాటిల్స్‌ను సీజ్ చేశారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఇందులో 80 బైక్‌లు, రెండు ఆటోలు, ఒక కారును సీజ్ చేశారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లు రూ. 87,895 ఆన్‌లైన్‌లో క్లియర్ చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడుతూ... గ్రామాల్లో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, ముగ్గురు సీఐలు, 15 మంది ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు

- దుర్వాసనతో స్థానికుల విలవిల

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను పారబోసిన ఘటన ఖాజీపల్లి పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు ఇలా... గడ్డపోతారం మున్సిపాలిటీ ఖాజీపల్లి పరిధిలోని సర్వేనం.181 వనదుర్గాదేవి ఆలయ సమీపంలోని బహిరంగ ప్రదేశాల్లో గుర్తుతెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా వ్యర్థాలను సంచుల్లో తీసుకొచ్చి పారబోశారు. దీంతో ఆ ప్రాంతమంతా వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఊపిరితీసుకోలేని పరిస్థితి నెలకొంది. అంతే కాకుండా సమీప చెరువు, కుంటలకు ఆ వ్యర్థాలు చేరి తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పీసీబీ అధికారులు స్పందించి వ్యర్థాలు పారబోసిన పరిశ్రమపై, క్షేత్ర స్థాయిలో గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



బహిరంగ ప్రదేశంలో పడేసిన వ్యర్థాల మూటలు

తోటి కోడలు, బంధువులు తిట్టారని..

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): తోటి కోడలు, బంధువులు తిట్టారని మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మెదక్ మండలం మాచవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోవిందాపురం రాజయ్య, భార్య లలిత(38), తోటి కోడలు సంగీత ఇంటి ముందున్న వాకిలి స్థలం గురించి గొడవపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సంగీత కుటుంబీకులు వచ్చి లలితను తిట్టడంతో ఆవేశానికి లోనై ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకొని చీరతో ఉరి వేసుకుంది. గమనించిన కుమార్తె అమూల్య కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వచ్చి తలుపులు తీసి చూసేలోపే ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉరేసుకొని గృహిణి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ రూమ్‌లో నివాసముండే సాదిక బేగం(20) ఆరు నెలల క్రితం షేక్ అహ్మద్‌తో ప్రేమ వివాహం జరిగింది. షేక్ అహ్మద్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి భోజనం చేసి బయటకు వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. సుమారు 30నిమిషాల తరువాత ఇంటికి వచ్చి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. తలపులు పగులగొట్టి చూడగా సాధిక బేగం ఉరేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కడుపునొప్పి భరించలేక యువతి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన జీ.శ్వేత(24) తన తల్లిదండ్రులతో కలిసి కొమరంభీం కాలనీలో నివాసం ఉంటుంది. కాగా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కొంత కాలంగా శ్వేత కడుపునొప్పితో బాధపడుతుందని, దీని కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎండు గంజాయి స్వాధీనం

నిందితుడి రిమాండ్

మునిపల్లి(అందోల్): ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, పోలీసులు వ్యక్తిని అరెస్ట్ చేశారు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు, సిబ్బంది గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బీదర్ నుంచి హైదరాబాద్‌కు యాక్టివాపై మొహమ్మద్ సమీర్ (35) గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు. అతడి వద్ద సుమారు 6.400 కిలో గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బీదర్ లోని ఇరాన్ గల్లీలో గుర్తు తెలియని వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏఎస్‌ఐ బక్కన్న, సిబ్బంది ఎండి. హనీఫ్, పాండు, సునీల్ పాల్గొన్నారు.



బస్తాలలో ఎండిన గంజాయి

శ్రీచైతన్య పాఠశాలకు షోకాజ్ నోటీసులు

- యునిఫాంలు ఉన్న గది సీజ్
- ఎంఈఓ సత్యనారాయణ

తూప్రాన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న శ్రీచైతన్య పాఠశాలను ఎంఈఓ సత్యనారాయణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అయితే పాఠశాలకు ప్రీ-ప్రైమరీ నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉంది. కానీ 9వ తరగతి నిర్వహిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా తొమ్మిదో తరగతి నడుపుతున్నట్లు గుర్తించినట్లు ఎంఈఓ తెలిపారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో యూనిఫాంలు విక్రయం కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత పాఠశాల యాజమాన్యానికి తక్షణమే 9వ తరగతిని నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేసి, యునిఫాంలు ఉన్న గదిని సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే పిల్లలను చేర్పించాలని సూచించారు.



శ్రీచైతన్య పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఇద్దరు వ్యక్తులు మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని కొల్గూరు గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కర్రొల్ల ప్రశాంత్(21) సిద్దిపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తొగుట మండలం జప్తి లింగారెడ్డిపల్లికి చెందిన మర్పడగ(గాజులపల్లి) రాజిరెడ్డి(38) పెయింటర్‌గా పనిచేస్తూ గజ్వేల్‌లో నివసిస్తున్నాడు. ప్రశాంత్ తన పని ముగించుకొని సిద్దిపేట నుంచి కొల్గూరు గ్రామానికి స్కూటీపై బయలుదేరాడు. ఇదే క్రమంలో గజ్వేల్ నుంచి రాజిరెడ్డి కూడా బైక్‌పై వస్తున్నాడు. కొల్గూరు దాటిన తర్వాత పెద్దమ్మ గుడి సమీపంలో వీరిద్దరు ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.



ప్రశాంత్



రాజిరెడ్డి